సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 19 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.35,100
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35,100 పలికాయి.



కిలో టమాట రూ.30
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.16 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
32.1°/18.5°
జిల్లా వ్యాప్తంగా సోమవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై చాలా ప్రాంతాల్లో మోస్తరుగా వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

భక్త కనకదాస జీవితం నేటి తరాలకు ఆదర్శం

- జయంతి వేడుకల్లో కలెక్టర్ చేతన్



కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: మహాకవి, తత్వవేత్త, సంగీతకారుడు, స్వరకర్త భక్త కనకదాస జీవితం నేటి తరాలకు ఆదర్శమని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పుట్టపర్తి సాయిఆరామంలో భక్త కనకదాస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ చేతన్ ముఖ్య అతిథిగా హాజరై భక్త కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో మార్పు కోసం కృషి చేసిన మహనీయుడు కనకదాస అన్నారు. ఆయన జీవిత చరిత్ర చూస్తే విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలనేది కనకదాస ఆశయమన్నారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసి చైతన్య పర్చిన గొప్ప మానవతావాదిగా అభివర్ణించారు. కనకదాస ఆనాడే ఉన్నత చదువులు చదివి సమాజాన్ని అన్ని కోణాల్లో అధ్యయనం చేశారన్నారు. ఆయన జీవితం ఎందరికో ఆదర్శమని, అందుకే ప్రభుత్వం భక్త కనకదాస జయంతిని అధికారికంగా జరుపుతోందన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి నిర్మలా జ్యోతి, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, నాయకులు మల్లికార్జున, చెన్నప్ప, రమేష్, జగదీష్‌తో పాటు పలువురు కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు

బాలికలు ప్రపంచాన్నే మార్చగలరు

- కలెక్టర్ టీఎస్ చేతన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రోత్సాహం అందిస్తే బాలికలు అద్భుతాలు చేయగలరని, ప్రపంచాన్ని మార్చగలిగే శక్తివంతులుగా ఎదుగుతారని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కిశోర బాలికల వికాసానికి సంబంధించిన శిక్షణ వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కిశోరి వికాసం శిక్షణలో విద్య ప్రాముఖ్యత, ఆరోగ్యం, వ్యక్తిగత ఆరోగ్యం, పౌష్టికాహారం, మానవ అక్రమ రవాణా, బాలలపై లైంగిక దాడుల నిరోధక చట్టం, సెల్ఫ్ డిఫెన్స్, యోగా, లైఫ్ స్కిల్స్ తదితర వాటిపై మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇస్తామని, వారు మహిళా పోలీస్, వార్డ్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సెక్రెటరీ, ఏఎన్‌ఎం, అంగన్‌డీ వర్కర్లకు శిక్షణ ఇస్తారన్నారు. ఇలా శిక్షణ పొందిన వారు కళాశాలలు, పాఠశాలల్లోని 11 నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలకు అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.



ఇది పెనుకొండలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర హాస్టల్. ఇక్కడ 231 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రహరీ కూలిపోవడంతో విద్యార్థులకు భద్రత కరువైంది. ప్రధాన రహదారి పక్కనే వసతి గృహం ఉండటంతో ఎప్పుడు ఏ వాహనం దూసుకొస్తుందోనన్న భయం విద్యార్థులను వెంటాడుతోంది. ప్రహరీ స్థానంలో ఉపాధ్యాయులు ముళ్లకంచె వేయడం, వసతి గృహం ఎదురుగా ఉన్న చెట్లకు తాళ్లు కట్టి విద్యార్థులు దుస్తులు ఆరవేస్తుండటంతో అదో శిథిలభవనంలా కనిపిస్తోంది.



పుట్టపర్తి మున్సిపాలిటీలోని బీసీ బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్ల పరిస్థితి ఇది. 100 మంది విద్యార్థులున్న ఈ హాస్టల్‌లో 4 గదులే ఉన్నాయి. మరుగుదొడ్లకు కనీసం తలుపులు కూడా లేవు. కిటికీలకు మెష్ కొట్టకపోవడంతో దోమల మోత ఎక్కువగా ఉంది. ఇక బాలికల సంక్షేమ వసతి గృహంలోనూ సమస్యలు తిష్టవేశాయి. చిన్నపాటి వర్షాలకే వసతి గృహంలోకి నీరు చేరుతుండడంతో కింది భాగంలో ఉన్న 10 గదులు నిరుపయోగంగా వదిలేశారు. రెండో అంతస్తులోని 5 గదుల్లో 115 మంది విద్యార్థులు ఉంటున్నారు. గదులు సరిపోక వరండాలో పడుకుంటున్నారు.

వసతి.. అధోగతి!

జిల్లాలో వసతి గృహాల వివరాలు

57	26	05
బీసీ హాస్టళ్లు	ఎస్సీ హాస్టళ్లు	ఎస్టీ హాస్టళ్లు
06	30	14
ఎస్టీ గురుకుల పాఠశాలలు	కేజీబీవీలు	ఎంజేపీ గురుకుల పాఠశాలలు

సం'క్షోభ' హాస్టళ్లు

- చాలా హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కరువు
- నీళ్ల చారు.. ముద్ద అన్నమే భోజనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- రోగాలతో బెంబేలెత్తిపోతున్న విద్యార్థులు
- నిర్వహణ సరిగాలేక తగ్గిన విద్యార్థుల సంఖ్య
- సమస్యలు బయటికి చెప్పరాదంటూ అధికారుల వార్నింగ్

సాక్షి, పుట్టపర్తి: పేద విద్యార్థులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం అన్నింటా.. చిన్న చూపు చూస్తోంది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండ నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులను సమస్యలు వెంటాడుతున్నాయి. ఎక్కడ చూసినా వెలగని బల్బులు.. తలుపుల్లేని కిటికీలే కనిపిస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారడంతో దోమలు వ్యాప్తి చెంది చిన్నారులు వ్యాధులు బారిన పడుతున్నారు. మెనూ సరిగా అమలు కాకపోవడంతో నీళ్ల చారు.. ముద్ద అన్నంతోనే విద్యార్థులు సర్దుకుంటున్నారు. ఫలితంగా సంక్షేమ గృహాల్లో వసతి...అధోగతిగా మారింది.

మంత్రి ఇలాకాలో బాలికల అవస్థలు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండలో గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో వసతులు కరువయ్యాయి. దీంతో గతేడాదితో పోలిస్తే విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. పైగా వసతి గృహం సమస్యలను ఎవరూ బయటకు చెప్పకూడదంటూ మంత్రి నుంచి హెచ్చరికలు వెళ్లినట్లు తెలుస్తోంది. వసతి గృహంలో మరుగుదొడ్ల నిర్వహణ దారుణంగా ఉంది. మంత్రి ఆదేశాలతో వసతి గృహాల్లోకి మీడియాను కూడా అధికారులు అనుమతించడం లేదు.



ఇది లేపాక్షిలోని బీసీ బాలుర వసతి గృహం. హాస్టల్ భవనంలో ప్రభుత్వ ఐటీఐ నిర్వహిస్తుండడంతో విద్యార్థులు శిథిలావస్థకు చేరిన వసతి గృహంలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

జిల్లా కేంద్రంలోనూ విద్యార్థుల ఇక్కట్లు

జిల్లా కేంద్రం పుట్టపర్తి నడిబొడ్డున సత్యమ్మ గుడి సర్కిల్‌లో ఉన్న బాలికల వసతి గృహంలో వర్షం వస్తే విద్యార్థుల ఇక్కట్లు అన్నీఇన్నీకావు. భవనంలోకి నీళ్లు ప్రవేశిస్తుండటంతో విద్యార్థులంతా పైఅంతస్తులో ఉండాల్సిన పరిస్థితి. పుట్టపర్తి పక్కనే ఎనుములపల్లిలోని బీసీ, ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా మారింది. కిటికీలకు తలుపులు లేవు. దీంతో దోమలు విపరీతంగా వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. అదేవిధంగా లైట్లు అలంకారప్రాయంగా మారడంతో అంధకారంలో గడువుతున్నట్లు చెబుతున్నారు.

అన్నీ అవస్థలే

- ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ అద్దె భవనంలో బీసీ బాలికల, ఎస్సీ బాలికల హాస్టళ్లు ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తులో వసతి గృహాలు ఉండటంతో విద్యార్థినులు రోజు పైకి, కిందకు దిగుతూ మోకాళ్ల నొప్పులు, కాళ్ల వాపులతో ఇబ్బందులు పడుతున్నారు. కనీస సౌకర్యాలు లేవు. ఇక ఇరుకైన మెట్లు మాత్రమే ఉన్నాయి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే విద్యార్థులు బయటకు రావడం కూడా కష్టమే.
- ధర్మవరం ఎల్‌పీ సర్కిల్‌లోని బాలసదన్‌లో విద్యార్థినులకు సరిపడా మరుగుదొడ్లు లేవు. దుర్గానగర్ ఎస్సీ బాలికల హాస్టల్‌లో మరుగుదొడ్లు సరిగ్గా లేకపోవడంతోపాటు స్నానాలు చేసేందుకు బాత్‌రూంలు కూడా సరిగ్గాలేవు. ఎస్‌బీఐ కాలనీలోని ఎస్సీ బాలుర వసతి గృహం పక్కనే చెత్తాచెదారం పేరుకుపోవడంతో విద్యార్థులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు.

చలివాత...దోమల మోత

బత్తలపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో 363 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే సరిపడినన్ని మరుగుదొడ్లు, బాతురూంలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిటికీలకు మెస్ లేకపోవడంతో దోమలు, చలితో రాత్రి నిద్ర పట్టడం లేదని విద్యార్థులు చెబుతున్నారు.



ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన బీసీ బాలికల వసతి గృహం



అమరాపురం ఎస్సీ బాలుర వసతి గృహంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు



సౌకర్యాలు లేక బత్తలపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థులంతా ఒకే గదిలో నిద్రిస్తున్న దృశ్యం

శిథిలావస్థకు చేరిన వసతి గృహం



రాళ్లపల్లి వసతి గృహం పైకప్పు పెచ్చులూడిన దృశ్యం

గుడిబండ మండలం రాళ్లపల్లి గ్రామంలోని బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే విద్యార్థులు తల దాచుకునేందుకు ఇబ్బందులుపడుతున్నారు. హాస్టల్ భవనం శ్లాబు పెచ్చులు ఎక్కడ ఊడిపడతయోనని విద్యార్థులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ఉంటున్నారు.

తాడిమర్రిలోని బీసీ హాస్టల్ మరుగుదొడ్ల పరిస్థితి ఇది. సౌకర్యాలు సరిగా లేక 16 మంది విద్యార్థులే ఇక్కడ ఉంటున్నారు. మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాడుకలో లేక నిరుపయోగంగా ఉన్నాయి. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



బీసీలపై చంద్రబాబు కపట ప్రేమ

- టీటీడీ సభ్యులుగా కురుబలు పనికిరారా?
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ మండిపాటు



ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: ఓట్ల కోసం బీసీలపై ప్రేమ కురిపించే చంద్రబాబుకు పదవులిచ్చే సమయంలో మాత్రం బీసీలు గుర్తుకురారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలో రాజ్యాంగ పదవుల్లో బీసీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని చెప్పిన చంద్రబాబు... అధికారంలోకి రాగానే ఆ మాటే మరచిపోయారన్నారు. కనకదాస జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామంటూ గొప్పలు చెబుతున్న చంద్రబాబు... బీసీల్లో అధిక జనాభా ఉన్న కురుబలకు ఏం చేశారో చెప్పాలన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపులో కురుబలకు మొండి చెయ్యి చూపించారన్నారు. టీటీడీ పాలక మండలిలో 41 మంది సభ్యులుంటే ఒక్కరూ కురుబ కులానికి చెందిన వారు లేకపోవడం దారుణమన్నారు. టీటీడీ బోర్డు మెంబర్‌గా కురుబలు పనికిరారా అని చంద్రబాబును ప్రశ్నించారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామన్న చంద్రబాబు.. దానిపై నోరు మెదపడం లేదన్నారు. బీసీలంటే బ్యాక్‌బోన్ క్యాస్ట్ అని ప్రకటించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అందుకు తగ్గట్లుగానే బీసీలకు రాజ్యాధికారం కట్టబెట్టారని గుర్తు చేశారు. కులవృత్తులకు ప్రాధాన్యం ఇచ్చి ఆర్థిక సాయం అందించారన్నారు. చంద్రబాబు మాత్రం బీసీలపై ఎనలేని ప్రేమ ఉన్నట్లు నాటకం ఆడుతూ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు.

భారీగా పోలీసుల బదిలీలు

- ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్‌ఐలు, 60 మంది కానిస్టేబుళ్లకు స్థాన చలనం



పుట్టపర్తి టౌన్: జిల్లాలో భారీగా పోలీసు బదిలీలు జరిగాయి. ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్‌ఐలతో పాటు 60 మంది కానిస్టేబుళ్లను స్థాన చలనం కల్పిస్తూ సోమవారం రాత్రి ఎస్పీ రత్న ఉత్తర్వులు జారీ చేశారు. కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ మోహన్‌ను వీఆర్‌కు పంపి, వీఆర్‌లో ఉన్న నిరంజన్ రెడ్డికి కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ బాధ్యతలను తాత్కాలికంగా అప్పగించారు. ఎస్‌ఐల బదిలీకి సంబంధించి వీఆర్‌లో ఉన్న ఇషాక్‌బాషాను ముదిగుబ్బ పీఎస్‌కు, వి. మహమ్మద్ అలీని సీసీఎస్‌కు, ఎన్. రమణారెడ్డిని కదిరి రూరల్ యూపీఎస్‌కు, జి. రాజప్రసాద్‌ను హిందూపురం టూటౌన్‌కు, ఎస్. జయప్పను పీసీఆర్ (పుట్టపర్తి), ఓ.బ్రహ్మానందరెడ్డిని హిందూపురం టూటౌన్‌కు, కియా ఎస్‌ఐగా ఉన్న ఎస్.నజీర్ అహమ్మద్‌ను రోడ్ సేఫ్టీ విభాగం (పెనుకొండ సబ్‌డివిజన్)కు, సీకే పల్లిలో ఉన్న బి. సూర్యనారాయణను రోడ్‌సేఫ్టీ విభాగం (ధర్మవరం సబ్‌డివిజన్)కు, వీఆర్‌లో ఉన్న మునిప్రతాప్‌ను హిందూపురం యూపీఎస్, రాజకుళ్లాయప్పను గుడిబండ పీఎస్‌కు బదిలీ చేశారు. వీరితో పాటు జిల్లాలోని 60 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ రత్న ఉత్తర్వులు జారీ చేశారు.

సంకటహర.. సాయిగోపాలా

వేదపండితుల మంత్రోచ్చారణలు.. కళాకారుల ఆటపాటలు.. భక్తుల నీరాజనాలు..ఎవరినోట విన్నా సాయిగోపాలుడి నామస్మరణే.. ఎవరిని కదిపినా 'సాయిరాం' అంటూ ప్రేమతో కూడిన పలకరింపులే. సత్యసాయి 99వ జయంత్యుత్సవాల ప్రారంభం సందర్భంగా సోమవారం కనిపించిన దృశ్యమిది. ఉదయం నిర్వహించిన వేణుగోపాల రథోత్సవం... రమణీయంగా సాగింది. భక్తకోటి సంకటహర.. సాయిగోపాలా అంటూ కీర్తించింది.

- ప్రారంభమైన సత్యసాయి 99వ జయంత్యుత్సవాలు
- భక్తి శ్రద్ధలతో సాగిన సామూహిక సత్యసాయి వ్రతాలు
- సాయి గోపాలుని స్మరణతో మార్మోగిన పుట్టపర్తి
- సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన కళాకారులు



రథం ముందు వేదమంత్రోచ్ఛారణతో సాగుతున్న పండితులు



నెమలి పింఛాలు ధరించి రథోత్సవంలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు



వేణుగోపాలస్వామి రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

ప్రశాంతి నిలయం: సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాలు సోమవారం అంతర్జాతీయ అధ్యాత్మిక ధామం ప్రశాంతి నిలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకలను పురస్కరించుకుని సత్యసాయి మహా సమాధిని సర్వాంగసుందరంగా అలంకరించారు. సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు.

వేదపఠనంతో వేడుకలు ప్రారంభం

సాయికుల్వంత్ సభా మందిరంలో ఉదయం 8 గంటలకు వేదపఠనంతో సత్యసాయి జయంత్యుత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదపండితులు పూజల అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. దేశ విదేశాలకు చెందిన 2,700 మంది వ్రతంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితులు సత్యనారాయణ రాజుగా పిలవబడే సత్యసాయి బాబా అవతార వైభవాన్ని, ఆయన లీలామృతాన్ని వివరించారు.

పురవీధుల్లో ఊరేగిన వేణుగోపాలుడు

సాయికుల్వంత్ సభా మందిరంలోని మూలవిరాట్టు వేణుగోపాల స్వామికి, ఉత్సవ మూర్తులైన సీతారామ, లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల నడుమ పండితులు సీతారాముల కల్యాణం నిర్వహించారు. అనంతరం మూలవిరాట్టును, ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగింపుగా ప్రశాంతి నిలయం ఉత్తర గోపురం వద్దకు తీసుకువచ్చి వేణుగోపాలుడిని రథంలో కొలువుదీర్చారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు నాగానంద, పలువురు ట్రస్ట్ సభ్యులు పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. ముందు ఉత్సవ మూర్తులు, ఆ వెనుకే మూలవిరాట్టు వేణుగోపాలస్వామి రథంపై పుట్టపర్తి పురవీధులలో ఊరేగారు. దేశ విదేశాల నుంచి తరలివచ్చిన భక్తులు సాయిగోపాలుని నామాన్ని స్మరిస్తూ ముందుకుసాగారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రముఖులు, భక్తులు, స్థానికులు రథాన్ని లాగారు. పట్టణ ప్రజలు నారికేళాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్వేత వస్త్ర ధారులైన సత్యసాయి విద్యాసంస్థల చిన్నారులు సాయిగోపాలుని నామాన్ని స్మరిస్తూ రథోత్సవంలో ముందు నడిచారు. రథోత్సవంలో సత్యసాయి బాలవికాస్ చిన్నారులు నెమలి నాట్యం, మహిళల కోలాటం, కళాకారుల గరగ నృత్యం అందరినీ అలరించారు. పలువురు చిన్నారులు పురాణేతిహాసాలను చాటుతూ సీతారామలక్ష్మణ, భరత శతృఘ్నుల వేషధారణలో ఆకట్టుకున్నారు. పెదవెంకమరాజు కల్యాణ మండపం వద్ద ఆర్‌జె.రత్నాకర్ రాజు దంపతులు హారతి ఇచ్చి వేణుగోపాల స్వామి రథోత్సవాన్ని ముగించారు. కార్యక్రమంలో ఎస్పీ వి.రత్న, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, సత్యసాయి సేవా సంస్థల కోఆర్డినేటర్లు చలం, లక్ష్మణరావు పాల్గొన్నారు.

8 రోజుల పాటు మెడికల్ క్యాంప్

సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మెడికల్ క్యాంప్‌ను సోమవారం ఆర్‌జె.రత్నాకర్ రాజు ప్రారంభించారు. దేశ విదేశాలకు చెందిన వివిధ విభాగాల స్పెషలిస్టు వైద్యులు 8 రోజుల పాటు సేవలు అందించనున్నట్లు సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

మహానారాయణ సేవ ప్రారంభం



నారాయణ సేవ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ చేస్తున్న ఆర్‌జే రత్నాకర్

సత్యసాయి జయంత్యుత్సవాల్లో భాగంగా ప్రశాంతి నిలయంలోని నార్త్ బిల్డింగ్స్ వెనుక ఉన్న మైదానంలో మహానారాయణ సేవ కార్యక్రమం ప్రారంభమైంది. నారాయణ సేవలో భాగంగా 11 కౌంటర్ల ద్వారా మహిళలకు, మరో 11 ప్రత్యేక కౌంటర్ల ద్వారా పురుషులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ నెల 24 తేదీ వరకు రోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అన్న ప్రసాద వితరణ చేయనున్నారు. రోజు సుమారు 50 వేల మందికి అన్నదానం చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌జే రత్నాకర్ తెలిపారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో సేవలందించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 3 వేల మంది సత్యసాయి సేవాదళ్ సభ్యులు ప్రశాంతి నిలయం చేరుకున్నట్లు ఆయన వెల్లడించారు.

క్లుప్తంగా

జర్మనీలో ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఓమ్‌క్యాప్, సమ్‌కేర్ సంయుక్తంగా నిరుద్యోగ యువతకు జర్మనీ భాషపై శిక్షణ ఇవ్వడంతో పాటు ఆ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రామకృష్ణ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీఎస్సీ, ఎమ్మెస్సీ, నర్సింగ్, ఏఎన్ఎం, జీఎన్ఎం పూర్తి చేసి, 35 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులు. ఎంపికైన వారికి తిరుపతిలో రెసిడెన్సియల్, డేస్కాలర్స్ విధానంలో జర్మనీ భాషపై 6 నెలల పాటు 4 దశల్లో శిక్షణ ఇస్తారు. శిక్షణ అనంతరం ప్రాథమిక, ఇంటర్వ్యూ ద్వారా అర్హత సాధించిన వారు జర్మనీలో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, నాలుగు ఫొటోలు, జనన ధ్రువీకరణ పత్రం, అనుభవం, వివాహ ధ్రువీకరణ పత్రం, నోటరీ, నర్సింగ్ కౌన్సిలింగ్, కోవిడ్ సర్టిఫికెట్‌తో ఈ నెల 23వ తేదీలోపు skillinternational@apsdc.in మెయిల్ చేయాలి. పూర్తి వివరాలకు 96767 06976లో సంప్రదించవచ్చు.

కంటైనర్ బోల్తా



చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రం సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఓ కంటైనర్ బోల్తా పడింది. సేలం నుంచి ఢిల్లీకి బయలుదేరిన చెన్నేకొత్తపల్లి సమీపంలోకి రాగానే టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌పై అడ్డంగా పడింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని బోల్తాపడిన వాహనాన్ని తొలగించి, రాకపోకలు పునరుద్ధరించారు.

విద్యార్థుల సామర్థ్యాలకు 'పరీక్ష'

- 3, 6, 9 తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల మెరుగుకు 'నాస్'
- డిసెంబర్ 4న ఓఎంఆర్ విధానంలో నిర్వహణ



అగళి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసన, ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలను అంచనా వేసేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) పేరుతో పరీక్ష నిర్వహిస్తున్నారు. ప్రతి మూడేళ్లకోసారి ఈ పరీక్ష నిర్వహిస్తుండగా... 2021లో చివరిసారిగా జరిగింది. మరలా ఈ ఏడాది పరీక్ష నిర్వహణకు విద్యాశాఖ, సమగ్రశిక్ష, ఎస్‌సీఈఆర్‌టీ చర్యలు చేపట్టాయి. వచ్చే నెల 4న నాస్ పరీక్ష నిర్వహించనున్నారు. గతేడాది నవంబర్ 3న స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) పేరుతో మండల స్థాయిలో సర్వే పూర్తయింది. దీని ఆధారంగా విద్యార్థుల విద్యాప్రమాణాలు అంచనా వేశారు.

పరీక్షలు ఇలా....

ఎస్‌సీఈఆర్‌టీ నిర్వహించే నాస్ పరీక్షకు ముందుగా ప్రాక్టీస్ పేపర్ల ద్వారా తర్ఫీదు ఇస్తారు. 3, 6 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ పాఠ్యాంశాలపై పరీక్షలు ఉంటాయి. 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతి సిలబస్, 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతి సిలబస్, 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్‌పై ప్రశ్నలు అడుగుతారు. 3వ తరగతి విద్యార్థులు 45 మార్కులకు 90 నిమిషాల వ్యవధి, 6వ తరగతి విద్యార్థులు 51 ప్రశ్నలకు 90 నిమిషాల వ్యవధి, 9వ తరగతి విద్యార్థులకు 60 ప్రశ్నలకు 120 నిమిషాల వ్యవధిలో సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఓఎంఆర్ షీట్ విధానంలో పరీక్ష ఉంటుంది.

ఒక్కో పాఠశాల నుంచి 30 మంది

నాస్ పరీక్షకు జిల్లాల్లో 93 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాల నుంచి సుమారు 30 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. జిల్లా స్థాయి కో–ఆర్డినేటర్‌గా డీఈఓ, సహాయ కో–ఆర్డినేటర్‌గా డీసీఈబీ కార్యదర్శి వ్యవహరిస్తారు. నిర్వహణ ప్రక్రియను సమగ్ర శిక్ష ఏఎంఓ, డైట్ ప్రిన్సిపాల్, డీఈఓ కార్యాలయ ప్రతినిధి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్లు పరిశీలిస్తారు. మండల స్థాయిలో పరీక్షల నిర్వాహకులుగా ఎంఈఓలతో పాటు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వ్యవహరిస్తారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ సిద్ధమైంది. డైట్, బీఎడ్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ విద్యార్థులతో పాటు శాస్త్ర ఛాత్రోపాధ్యాయులను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా నియమించనున్నారు.

త్వరలో శిక్షణ



నాస్ పరీక్షల నిర్వహణకు ఎంపికైన ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు, అబ్జర్వర్లు, మండల విద్యాశాఖాధికారులకు త్వరలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నాం. పరీక్షల నిర్వహణపై పూర్తి స్థాయి అవగాహన కలిగిస్తాం.

– కృష్ణప్ప, డీఈఓ

పకడ్బందీ ఏర్పాట్లు



జిల్లాలో నాస్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఎంపిక చేసిన పాఠశాలల్లోనే విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తాం. విద్యార్థుల్లో అభ్యాసనా సామర్థ్యాలు గుర్తించడానికి, అనంతరం వారికి మరింత ఉన్నత ప్రమాణాలతో బోధనను అందించేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయి.

– భాస్కరరెడ్డి, పరీక్షల నిర్వహణ సంస్థ కార్యదర్శి

'పోలీసు స్పందన'కు 50 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 50 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, సమస్య తీవ్రతపై బాధితులతో ఆరా తీశారు. చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, డీసీఆర్‌డీ సీఐ శ్రీనివాసులు, సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నుంచి ముగ్గురి సస్పెన్షన్

పెనుకొండ రూరల్: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే అభియోగంపై గోరంట్ల మండలానికి చెందిన బాచన్నపల్లి కె.బాబు (బులెట్ బాబు), నాగేనాయక్, పాటూరి శంకర్‌రెడ్డి (కలిగిరి శంకర్‌రెడ్డి)ని వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

కల్వర్టు తొలగించిన టీడీపీ నేత



బలిజపల్లిలో కల్వర్టు తొలగించిన దృశ్యం

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ పంచాయతీ బలిజపల్లిలో చెరువు కట్టపై నుంచి గ్రామానికి వెళ్లే మార్గంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా రాకపోకలు సాగించేందుకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రాజారెడ్డి ఇటీవల కల్వర్టు నిర్మించి మట్టి దారి వేయించారు. ఇందు కోసం పంచాయతీ నుంచి అనుమతులు కూడా ఆయన పొందారు. అయితే ఈ విషయం నచ్చని కొడికొండకు చెందిన టీడీపీ నేత బాలాజీ ఆదివారం జేసీబీని ఏర్పాటు చేయించి కల్వర్టును తొలగించాడు. ప్రజల కోసం తాను కల్వర్టు నిర్మిస్తే కక్ష సాధింపుతో తొలగించడం మంచిది కాదని రాజారెడ్డి మండిపడ్డారు.

చెలరేగిన టీడీపీ గూండాలు

- వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి
- కొత్తచెరువు నడి సెంటర్‌లో పోలీసులు చూస్తుండగానే ఘటన
- తీవ్రంగా గాయపడిన నలుగురు



ఆస్పత్రిలో చేరిన హరి





బాధితులు వినోద్‌కుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ నేతల దౌర్జన్యాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారు. అక్కడితో ఆగకుండా బాధితులపైనే కేసులు బనాయిస్తున్నారు. తాజాగా ఆదివారం రాత్రి పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువులో నిత్యం రద్దీగా ఉండే వైఎస్సార్, నెహ్రూ సర్కిళ్లతో పాటు ధర్మవరం బస్టాండ్ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ గూండాలు మూకుమ్మడిగా దాడి చేశారు. పోలీసులు చూస్తుండగానే... కొడపగానిపల్లికి చెందిన వినోద్‌కుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, హరిపై అకారణంగా కాళ్లతో, కర్రలతో విరుచుకు పడ్డారు. కొత్తచెరువుకు చెందిన టీడీపీ ముఖ్య నేత శ్రీనివాసులు ప్రత్యక్షంగా దాడుల్లో పాల్గొన్నట్లు బాధిత కార్యకర్తలు వాపోయారు.

జరిగిన పరిణామాలు ఇవే...

కొత్తచెరువు మండలం కొడపగానిపల్లికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త ఈడిగ మారుతి రెండు రోజుల క్రితం సోషల మీడియాలో ఓ పోస్టును పెట్టారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ తీర్చిదిద్దిన ప్రభుత్వ బడి ఫొటోతో పాటు ఇటీవల 'బడి వైన్స్' పేరుతో తిరుపతిలో ప్రారంభించిన మద్యం దుకాణం ఫొటోను జతపరుస్తూ పోస్టు చేశారు. ఇందులో తప్పిదం ఏమీ లేకపోయినా... సీఎం చంద్రబాబు మద్యం పాలసీని తప్పు బట్టారని, ఆ పోస్టును తొలగించకపోతే కేసు పెడతామని స్థానిక టీడీపీ నేత శివయ్య బెదిరింపులకు దిగాడు. అంతటితో ఆగకుండా విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. అయితే ఇంత చిన్న విషయాన్ని రచ్చ చేయరాదని, కేసులు.. గీసులు ఏమీ వద్దని పోలీసులు నచ్చచెప్పారు. అదే సమయంలో ప్రశాంతమైన గ్రామంలో వర్గ కక్షలు ఉండరాదని భావించిన మారుతి కూడా ఆ పోస్టును తొలగించాడు. దీంతో అప్పటికి సమస్య సద్దుమణిగిందనుకున్నారు.

అకారణంగా దాడి

అయినా కక్ష కట్టిన శివయ్య... మారుతి పోస్టును స్క్రీన్ షాట్ తీసి ఆదివారం కొత్తచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఒత్తిళ్లను తాళలేక మారుతిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విషయం తెలుసుకున్న కొడపగానిపల్లికి చెంది వైఎస్సార్‌సీపీ నాయకులు వినోద్‌కుమార్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, హరి... కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని మారుతీకి స్టేషన్ బెయిల్ ఇచ్చే విషయంగా పోలీసులతో చర్చించి ఆదివారం రాత్రి బయటకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ ముఖ్య నేత శ్రీనివాసులు తన అనుచరులతో కలసి పథకం ప్రకారం కొత్తచెరువులోని ప్రధాన కూడళ్లలో వీధి లైట్లను ఆఫ్ చేయించి వినోద్‌కుమార్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, హరిపై దాడికి తెగబడ్డారు. చెప్పులు, కర్రలు, ముష్టిఘాతాలతో విరుచుకుపడ్డారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన హరి అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మిగిలిన ఇద్దరికి మూగ దెబ్బలయ్యాయి. ఘటనపై బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం మారుతిని సోమవారం పోలీసులు వదిలేశారు.

దాడిని ఖండించిన మాజీ ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వినోద్‌కుమార్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, హరిపై జరిగిన దాడిని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఖండించారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం లోకేష్ రెడ్‌బుక్కు రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు కంకణం కట్టుకుందని మండిపడ్డారు. పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. అనంతరం బాధితులను ఆయన ఫోన్‌లో పరామర్శించారు. అలాగే బాధితులను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. వీరిలో కేశాపురం సర్పంచ్ నరేందర్‌రెడ్డి, కొడపగానిపల్లి, తలమర్ల మాజీ సర్పంచులు రఘునాథరెడ్డి, శ్యామ్ సుందరరెడ్డి తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు

హిందూపురం: స్థానిక ముక్కిడిపేట పాత ఎస్సీ బాలుర హాస్టల్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (ఎన్ఏసీ)లో నిరుద్యోగ యువతీ యువకులకు ఎలక్ట్రీషియన్, ల్యాండ్ సర్వేయింగ్ విభాగాల్లో శిక్షణ ఇచ్చి ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న వారు తమ బయోడేటాతో పాటు, ఆధార్ కార్డ్, విద్యార్హత పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాల కోసం 91105 50779లో సంప్రదించవచ్చు.



నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేయండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎక్సైజ్ శాఖ డీసీ నాగమద్దయ్య

పుట్టపర్తి టౌన్: మద్యం వ్యాపారులు ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ సిబ్బందిని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి ఆదేశించారు. సోమవారం పుట్టపర్తిలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను వారు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు మద్యం విక్రయాలు సాగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ అపహరణ కేసులో నిందితుల అరెస్ట్

కదిరి టౌన్: లారీని అపహరించుకెళ్లిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివారం రాత్రి కదిరిలోని మదనపల్లి రోడ్డు పక్కన పర్వీన్‌భాను పెట్రోల్ బంకు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఆపిన లారీని దుండగులు అపహరించుకెళ్లారు. ఘటనపై లారీ డ్రైవర్ దస్తగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు పక్కా ఆధారాలతో సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో నంబూలపూలకుంట సమీపంలో లారీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. లారీని అపహరించుకెళ్లిన వైఎస్సార్ జిల్లాకు చెందిన యామనూర్ సర్దార్ హుస్సేన్, సాగినాల వెంకటేష్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

అలరించిన సంగీత కచేరీ



కచేరీ నిర్వహిస్తున్న అరుణ్ బృందం

ప్రశాంతి నిలయం: సత్యసాయి 99వ జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత కర్ణాటక సంగీత విద్వాంసుడు డాక్టర్ ఓఎస్ అరుణ్ బృందం సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ ఆయన చేసిన గాత్రంతో సాయికుల్వంత్ సభామందిరం మార్మోగింది. అనంతరం అరుణ్ బృందాన్ని సత్యసాయి ట్రస్ట్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి



ధర్నా నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు

ప్రశాంతి నిలయం: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తల సంఘం జిల్లా కార్యదర్శి సౌభాగ్యమ్మ మాట్లాడుతూ... ఆశ వర్కర్ల జీతాలు రూ.24 వేలకు పెంచాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్యకర్తలు మరణిస్తే మట్టి ఖర్చులకు రూ.20 వేలు మంజూరు చేసేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు సాంబశివ, ఉపాధ్యక్షురాలు మహంతి, సీఐటీయూ నాయకులు, జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మడుగువారిగొంది చెరువుకు పైపింగ్



పైపింగ్‌ను పూడుస్తున్న రైతులు

గాండ్లపెంట: మండలంలోని తూపల్లి పంచాయతీ వంకపల్లి సమీపంలోని మడుగువారిగొంది చెరువుకు పైపింగ్ పడింది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు చెరువుకు నీరు చేరి మరవ పారింది. మరువ వద్దనే సోమవారం పైపింగ్ పడడంతో గమనించిన రైతులు వెంటనే సర్పంచ్ లక్ష్మీదేవమ్మ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ద్వారా సమాచారం అందుకున్న తహసీల్దార్ బాబురావు, నీటిపారుదల శాఖ జేఈఈ అరుణ అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే రైతులు పైపింగ్‌ను మట్టితో పూడ్చేశారు. అనంతరం అధికారులు ఇసుక బస్తాలు వేసి పూర్తి స్థాయిలో నీరు పోకుండా అడ్డుకున్నారు. త్వరంలో చెరువు మరువ వద్ద అభివృద్ధి పనులు చేపడతామని ఈ సందర్భంగా రైతులకు జేఈఈ అరుణ భరోసానిచ్చారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందజేసిన వినతులకు శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 195 వినతులు అందాయి. కలెక్టర్‌తో పాటు జేసీ అభిషేక్ కుమార్, ఇతర శాఖల అధికారులు వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడి సమస్య తీవ్రత తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. ప్రజల వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా జాగ్రత్త పడాలన్నారు. సంక్షేమ పథకాల అమలు, స్వర్ణాంధ్ర -2047పై స్పష్టమైన నివేదికలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలతో కలెక్టర్ మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, పంచాయతీ సెక్రెటరీల ఆధ్వర్యంలో ఐహెచ్‌హెచ్ఎల్‌ల కోసం రిజిస్ట్రేషన్ డ్రైవ్ చేపట్టి అర్హులైన లబ్ధిదారులందరికీ మంజూరు ఉత్తర్వులు అందజేయాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయడానికి గ్రామ స్థాయి శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. అపార్ కార్డులు విద్యార్థులకు మాత్రమే జారీ చేయడం జరుగుతుందని, కేటగిరీల వారీగా విభజించి ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆధార్ కార్డులో మార్పులకు సంబంధించి తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణ పత్రాలు అవసరం ఉన్నందున, వాటిని చిన్నపాటి మార్పులు చేసి సంబంధిత ప్రధానోపాధ్యాయులే ధ్రువీకరణ పత్రాన్ని జోడించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు అడ్మిషన్ రిజిస్టర్‌లోనూ మార్పులకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయసారథి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ల్యాండ్ సర్వే ఏడీఈ విజయశాంతి బాయి, ఎల్‌డీఎం రమణకుమార్, సెరికల్చర్ జేడీ పద్మావతి, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, పశుసంవర్థక శాఖ జేడీ శుభదాస్,, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ శ్రీదేవి, వ్యవసాయాధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.